### పది కుళాయిలకు ఒక్కటే పని చేస్తోంది..

- ఇదీ పెంట గ్రామంలోని తాగునీటి ట్యాంకు పరిస్థితి
- గ్రామస్థులకు తప్పని ఇబ్బందులు



8లో

# గురజాడ జీవితం.. భావితరాలకు ఆదర్శం

- ఆయన గృహాన్ని, సంపదను పరిరక్షించాలి
- హైకోర్టు సీనియర్ జడ్జి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్
- ఆచార్య ఇనాక్‌కు గురజాడ పురస్కారం ప్రదానం




మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

విజయనగరం రూరల్/కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహాకవి గురజాడ అప్పారావు జీవితం భావితరాలకు ఆదర్శమని హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్‌తో పాటు పలువురు వక్తలు కొనియాడారు. గురజాడ వర్ధంతి సందర్భంగా ఆదివారం నగరంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక వీవీజీ రాజు క్షత్రియ కళ్యాణ మండపంలో గురజాడ విశిష్ట పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి మానవేంద్రనాథ్ రాయ్ హాజరై మాట్లాడారు. గురజాడ వర్ధంతి సభలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందం ఇచ్చిందన్నారు. గురజాడ గృహాన్ని సందర్శించే భాగ్యం కూడా తనకు దక్కిందన్నారు. గురజాడ వ్యక్తి కాదని, శక్తిగా ఎదిగారని కొనియాడారు. గురజాడ రచనలు, పద్యాలు చదివిన అనుభవంతో తానేంతో చైతన్యవంతం అయ్యానన్నారు. ఇటువంటి మహనీయుల సంపదను కాపాడాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన గురజాడ దేశభక్తి గేయాలు, నేటి తరానికి కూడా ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ఇటువంటి సభలో పాల్గొనడానికి ఆహ్వానించిన గురజాడ సాంస్కృతిక సమాఖ్య సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త, పద్మ శ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు గురజాడ విశిష్ట పురస్కారాన్ని ప్రదానం చేశారు. అవార్డు గ్రహీత ఇనాక్ మాట్లాడుతూ.. ఇటువంటి మహనీయుల పేరుతో తనను సత్కరించి, సన్మానించడం మరువలేనిదన్నారు. గురజాడ ఒక వ్యక్తిగా కాకుండా శక్తిగా ఎదిగి యావత్తు జాతిని మేల్కొలిపారన్నారు. ఆయన గృహాన్ని, సంపదను భావితరాలకు అందించే విధంగా పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గురజాడ ఉత్తమ కవితా పురస్కారాలను సిరికి స్వామినాయుడు (పార్వతీపురం), కొత్త్తూరు సీతారామరాజు (కాకినాడ), మహ్మద్ ఆఫ్సర్ వలీషా (కోనసీమ), సునీత గంగవరపు (పల్నాడు), ఇనపకుర్తి చిన సత్యనారాయణ, చల్లపిల్ల శ్యామల (విజయనగరం)కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి బబిత, కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, ఎస్పీ దామోదర్, రోటరీ మాజీ గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు, గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు ఎం.వెంకటేశ్వరరావు, కాపుగంటి ప్రకాష్‌రావు, ఎ.గోపాలరావు, కోలగట్ల తమ్మన్నశెట్టి తదితరులు పాల్గొన్నారు.



గురజాడ గౌరవ యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం




ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన




పురస్కార గ్రహీత కొలకలూరి ఇనాక్‌తో జిల్లా న్యాయాధికారి బబిత, ఎస్పీ దామోదర్

**ఘనంగా గురజాడ గౌరవ యాత్ర..**

మహాకవి గురజాడ వర్ధంతి (మిగతా 8వ పేజీలో..)

# అవగాహనతోనే నియంత్రణ

- జిల్లాలో చాపకింద నీరులా హెచ్ఐవీ, ఎయిడ్స్
- నమోదవుతున్న కొత్త కేసులు
- అప్రమత్తతే కీలకం
- నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం

- రాజాం పట్టణానికి చెందిన ఓ వ్యక్తి హెచ్ఐవీ బారిన పడ్డాడు. గత 15 సంవత్సరాలుగా ఏఆర్‌టీ కేంద్రానికి వెళ్లి మందులు వాడుతున్నాడు. దీంతో ఆయువు పెంచుకున్నాడు. దైనందిన కార్యక్రమాల్లో ఎవరు సాయం లేకుండానే ముందుకెళుతున్నాడు.

రాజాం/విజయనగరం రింగ్‌రోడ్డు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో హెచ్ఐవీ మహమ్మారి కలవరపెడుతోంది. అవగాహన లోపం, నిర్లక్ష్యం కారణంగా కొత్త కేసులు నమోదవుతున్నాయి. అవగాహన లేక కొందరు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. దీంతో వారి కుటుంబాలు సైతం వీధినపడుతున్నాయి. సమాజంలో వివక్షకు గురవుతున్నాయి. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం.

**గతంతో పోల్చితే తగ్గాయి..**

నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ (నాకో) సంస్థ నివేదిక ప్రకారం జిల్లాలో ఎయిడ్స్ తగ్గుముఖం పట్టింది. 2002లో పది శాతానికి మించి ఉంటే.. ఇప్పుడు దాదాపు 0.05 శాతానికి తగ్గముఖం పట్టడం ఉపశమనం కలిగించే విషయం. 2002 నుంచి ఇప్పటివరకూ గణాంకాలు పరిశీలిస్తే 7 వేల మందికి హెచ్ఐవీ పాజిటివ్ ఉన్నట్టు తేలింది. ఏటా కొత్తగా వందల కేసులు వెలుగులోకి వస్తున్నాయి. వ్యసనాలు పెరగడం, ఆపై ఆర్థికపరమైన ఇబ్బందులతో సెక్స్ వర్కర్లు పెరగడం కారణంగా పలువురు హెచ్ఐవీ బారిన పడుతున్నారు. ఒక్కోసారి రక్తం, అవయవ మార్పిడి, అస్తవ్యస్త వైద్య విధానంతో ఈ వైరస్ వ్యాపిస్తోంది. దీని తీవ్రతలో జిల్లా తొలి పది శాతంలో ఉండడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. ప్రధానంగా 15 నుంచి 49 సంవత్సరాల్లోపు వారు హెచ్ఐవీ బారిన పడుతున్నారు. ముఖ్యంగా సెక్స్‌పరంగానే ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుండడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఐదేళ్లలో 5,657 మరణాలు సంభవించగా, ఇందులో పురుషులు 3,579 మంది, స్త్రీలు 2,078 ఉన్నారు.




**గత మూడేళ్లలో హెచ్ఐవీ కేసులు..**

| సంవత్సరం | పురుషులు | స్త్రీలు | మొత్తం |
|---|---|---|---|
| 2022-23 | 245 | 221 | 466 |
| 2023-24 | 209 | 180 | 389 |
| 2024-25 | 222 | 229 | 550 |

**అందుబాటులో మందులు..**

హెచ్ఐవీ విషయంలో చాలారకాల మందులు అందుబాటులోకి (మిగతా 8వ పేజీలో..)




ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఏర్పాటు చేసిన వాహనం



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

## గుర్ల మినీ రిజర్వాయర్‌ను పూర్తిచేస్తా

- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

మెంటాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్ల గెడ్డ మినీ రిజర్వాయర్ పెండింగ్ పనులను పూర్తి చేసి, దాన్ని రైతులకు అంకితం చేసే బాధ్యతను తాను తీసుకుంటానని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గుర్ల గ్రామంలో ఆదివారం నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ ప్రభుత్వ హయాంలోనే గుర్ల గెడ్డ మినీ రిజర్వాయర్‌ను పూర్తిచేసి తీరుతామని ప్రకటించారు. రైతు సంక్షేమమే ప్రధాన అజెండాగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అన్నదాతకు అన్ని విధాలా అండదండగా నిలుస్తోందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకూ రూ.20వేలు అందిస్తున్నామని తెలిపారు. ధాన్యం సేకరించిన 24 గంటల్లో డబ్బు అకౌంట్లో జమ చేస్తామని చెప్పినా, నాలుగైదు గంటల్లోనే చెల్లిస్తున్నా ఘనత కూటమి ప్రభుత్వానిదేనని చెప్పారు. రైతులు సేంద్రియ ఎరువులు వైపు మొగ్గు చూపాలని కోరారు. మోతాదుకు మించిన రసాయన ఎరువులు వాడకం వల్ల దిగుబడి నష్టంతోపాటు ఆరోగ్య సమస్యలకు కారమవుతోందని అన్నారు. చిరుధాన్యాలను అలవాటు చేసుకోవాలని సూచించారు. యువత, నిరుద్యోగులకు ఉపాధి కల్పనతో వారి కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చలుమూరి వెంకట్రావు, నాయకులు జి.అన్నవరం, సింగంపల్లి అప్పలనాయుడు, రెడ్డి ఆదినారాయణ, శరకాన రామునాయుడు, గొర్లె సన్యాసిరావు, అప్పికొండ సన్యాసిరావు, అప్పన్న, రెడ్డి ఎర్నాయుడు, గెడ్డ కాశీ తదితరులు పాల్గొన్నారు.

# చంపావతికి ఆకస్మిక వరద

- నదీ తీర గ్రామాల్లో భయంభయం
- మూగజీవాలు కొట్టుకుపోయినట్టు అనుమానం
- నీటి విడుదలపై సమాచారం ఇవ్వని ఇరిగేషన్ అధికారులు?

మెంటాడ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంపావతి నదికి ఆదివారం రాత్రి ఆకస్మిక వరద వచ్చింది. నదిలో ఒక్కసారిగా వరద ఉధృతి పెరగడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. రాత్రి సుమారు ఏడున్నర గంటల సమయానికి నదిలో కేవలం రెండు అడుగుల లోతున్న నీటి మట్టం ఒక్కసారిగా నాలుగడుగులపైకి చేరింది. ఆ సమయంలో మెంటాడ వద్ద నదిలో స్నానమాచరిస్తున్న సుమారు 20 మంది భవానీ భక్తులు తీవ్ర భయాందోళనకు గురై ఒడ్డుకు పరుగులు తీశారు. ఆకస్మిక వరదకు కొన్ని గొర్రెలు, మేకలు కొట్టుకుపోయి ఉంటాయని అనుమానిస్తున్నారు. ఎటువంటి వర్షాలు లేనప్పటికీ నదిలో ఆకస్మిక వరదకు కారణం ఏంటో అంతుబట్టక ప్రజలు భీతిల్లుతున్నారు. దీనిపై తహసీల్దార్ అరుణకుమారిని, ఆంధ్ర ఎస్ఐ సీతారాంను 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో సంప్రదించగా.. నదికి వరద వచ్చినట్లు తమకు ఎటువంటి సమాచారం లేదని చెప్పారు. ఇరిగేషన్ ఏఈ కృపానంద్ మాట్లాడుతూ.. 146 మీటర్ల సామర్థ్యానికి గాను 145.55 మీటర్లు ఉందని, ఆంధ్ర రిజర్వాయర్‌కు 50 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో రావడంతో జలాశయం సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వచ్చింది వచ్చినట్టుగా నీటిని చంపావతిలోకి విడుదల చేసున్నామని చెప్పుకొచ్చారు. ముందస్తు ప్రకటనేదీ లేకుండా నదిలోకి నీటిని విడుదల చేయడంపై ప్రశ్నిస్తే పొంతనలేని జవాబులిచ్చారు. ఈ రోజే విడుదల చేశామని.. కాదుకాదు నిన్న విడుదల చేశామని, అది ఈరోజుకి నదిలోకి వచ్చి చేరి ఉంటుందని చెప్పుకొచ్చారు. కనీసం తహసీల్దార్‌కైనా సమాచారం ఇవ్వాలి కదా అని ప్రశ్నిస్తే సమాధానం లేదు.

## ప్లాస్టిక్ నిషేధం ఎక్కడ?

- నగరంలో విచ్చలవిడిగా విక్రయం
- యథేచ్ఛగా వినియోగం
- తూతూ మంత్రంగా అధికారుల దాడులు



గణేష్ కోవెల వద్ద ఉన్న ఓ దుకాణంలో..



కేఎల్‌పురంలోని ఓ దుకాణంలో వినియోగిస్తున్న పాలిథిన్ కవరు

విజయనగరం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో ప్లాస్టిక్ నిషేధం కానరావడం లేదు. అన్ని దుకాణాల్లో విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతున్నాయి. ప్లాస్టిక్ వినియోగం ఆరోగ్యానికి ప్రమాదకరమని తెలిసినా.. పర్యావరణం దెబ్బతింటుందని తెలిసినా ప్రజలు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. దీనివల్ల కేన్సర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. 40మైక్రాన్లు కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిషేధం. దీనిని పక్కాగా అమలు చేయాల్సిన అధికార యంత్రంగా పట్టించుకోవడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ప్లాస్టిక్ విక్రయాలపై తూతూ మంత్రంగా దాడులు జరిపి ర్యాంకులు కోసం ఆరాటపడుతున్నారే తప్ప పూర్తిస్థాయి నియంత్రణలో విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఫలితంగా నగరంలోని కిళ్లీ బడ్డీలు, పండ్లు, కూరగాయలు, టిఫిన్, హోటళ్లు ఇలా అన్ని దుకాణాల్లో ప్లాస్టిక్ వినియోగం ఎక్కువైంది. దీంతో పట్టణంలో ఎక్కడిపడితే అక్కడే పాలిథిన్ సంచులు కనిపిస్తున్నాయి. నగర వీధులు, మురికి కాలువలు ప్లాస్టిక్ కూపాలుగా మారుతున్నాయి. నేల సైతం కలుషితమవుతోంది. పర్యావరణం దెబ్బతింటోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాస్టిక్ విక్రయాలను పూర్తిగా నిరోధించాలని నగరవాసులు కోరుతున్నారు. ఈ విషయమై విజయనగరం కార్పొరేషన్ ప్రజారోగ్య శాఖ అధికారి కొండపల్లి సాంబశివరావును వివరణ కోరగా.. 'నగరంలో ప్లాస్టిక్ వినియోగం పెరిగిన మాట వాస్తవమే. ఇక నుంచి దాడులు ముమ్మరం చేస్తాం. దీనికి సంబంధించి ఇప్పటికే పారిశుధ్య సిబ్బందికి అవగాహన కల్పించాం. ప్లాస్టిక్‌ను వినియోగించినా, అమ్మకాలు సాగించినా ఉపేక్షించేది లేదు.' అని అన్నారు.

## తుఫాన్ హెచ్చరికలతో రైతుల్లో కలవరం

- పంట కోత, నూర్పు దశలో ఉండటంతో బెంబేలు

7లో



సంతకవిటి: తమరాంలో పొలంలో వరి కుప్పలను పెట్టిన దృశ్యం

## చురుగ్గా పారాది కాజ్‌వే పనులు



8లో

# అదనపు భారం

- పట్టణాల్లో తాగునీటి పథకాలకు పెరిగిన వ్యయం
- గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం
- పనులు పూర్తిచేయనున్న కూటమి ప్రభుత్వం

నెల్లిమర్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తాగునీటి పథకాలపై అదనపు భారం పడింది. ఇప్పుడు ఈ పనులు పూర్తి చేసేందుకు అధికంగా వ్యయం చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టింది. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగ్గట్టుగా తాగునీటి పథకాలను నిర్మించాలని భావిస్తోంది. కోట్ల రూపాయల అదనపు భారం పడుతున్నా డీపీఆర్‌లు రూపొందించి టెండర్లు ఖరారు చేసే పనిలో పడింది. త్వరలో ఉమ్మడి జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల్లో తాగునీటి ప్రాజెక్టులు, పథకాల పనులు మొదలుకానున్నాయి.

**కేటాయింపులు ఇలా..**

జిల్లాలో ప్రస్తుతం ఉన్న మంచినీటి పథకాలతో పాటు అదనపు సామర్థ్యంతో తాగునీరు అందించేందుకు భారీగా నిధులు మంజూరయ్యాయి. నెల్లిమర్ల నగర పంచాయతీలో 6 ఎంఎల్‌డీల నీరు అందించేందుకు రూ.46 కోట్లు, విజయనగరం నగరపాలక సంస్థలో 7 ఎంఎల్‌డీలకు రూ.66.36కోట్లు, బొబ్బిలిలో 17 ఎంఎల్‌డీలకు రూ.126.39 కోట్లు, రాజాంలో 3 ఎంఎల్‌డీలకు రూ.9.82 కోట్లు, పార్వతీపురంలో 15 ఎంఎల్‌డీలకు రూ.86.54 కోట్లు, సాలూరులో 10 ఎంఎల్‌డీలకు రూ.100.36 కోట్లు, పాలకొండలో 7 ఎంఎల్‌డీలు అందించేందుకు రూ.71.94 కోట్లు కేటాయించారు.

**అన్ని పథకాలకూ పెరిగిన వ్యయం..**

వైసీపీ ప్రభుత్వంలో పట్టణాల్లో తాగునీటికి సంబంధించి నిర్లక్ష్యం కొనసాగింది. అప్పట్లో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ నిధులతో తాగునీటి పథకాలు ఏర్పాటు చేయాలని జగన్ సర్కారు నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాలోని సాలూరు, పాలకొండ, నెల్లిమర్ల పట్టణాల్లో రూ.171 కోట్లతో 13 (మిగతా 8వ పేజీలో..)





గోళ్లవలసలో వరి ఓవులు తిరగేస్తున్నరైతు

# తుఫాన్ హెచ్చరికలతో రైతుల్లో కలవరం

● పంట కోత, నూర్పు దశలో ఉండటంతో బెంబేలు

సంతకవిటి, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరి పంట కోత, నూర్పు దశలో ఉంది. ఇలాంటి సమయంతో తుఫాన్ కారణంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు బెంబేలెత్తు తున్నారు. ముకుందపురం, పుల్లిట, ఎం.ఆర్ అగ్రహారం, గోళ్లవలస, తమరాం తదితర గ్రామాల్లో పైరు బాగా పండింది. చివరి దశలో వరి కోతలు అక్కడక్కడే జరుగుతున్నాయి. కోసిన పంట ఇంకా పొలాల్లోనే ఉంది. ఈ తరుణంలో వాతావరణం మారడంతో అన్నదాతలు కలవరపడుతున్నారు. భారీ వర్షం కురిస్తే పంట పీట పాలవుతుందని వారు తలలు పట్టుకుంటున్నారు. పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఆపసోపాలు పడుతున్నారు. పనుల్లో బిజీగా ఉన్నారు.



యంత్ర సాయంతో నూర్పు చేస్తున్నరైతులు

## చికిత్స పొందుతూ మహిళ మృతి

కొమరాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అంటివలస గ్రామంలో ఈ నెల 20న ప్రమాదవశాత్తూ కట్టెల పొయ్యి వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడిన మండంగి పార్వతి విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పుట్టింటిలో గాయపడిన పార్వతిని తొలుత జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ మృతి చెందడంతో ఆదివారం రామభద్రపురం గ్రామంలోని అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటనపై ఎస్‌ఐ నీలకంఠం కేసు నమోదు చేశారు.

**భామినికి చెందిన వ్యక్తి..**

భామిని, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): భామిని గ్రామానికి చెందిన బొమ్మాళి సుదర్శన (40) రోడ్డు ప్రమాదంలో గాయపడి విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు.. సుదర్శన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం శ్రీకాకుళం జిల్లాలోని హరిదాసుపురంలో అత్తవారింటికి బస్సులో బయలుదేరారు. వారంతా నందిగాం సమీపంలో ఎన్ఎన్‌పేట జంక్షన్‌లో దిగారు. అయితే సుదర్శన కుమార్తె రోడ్డు వైపు వెళుతుండటంతో పాపను తీసుకు రావడానికి ఆయన వెళ్లారు. ఈక్రమంలో సుదర్శనను ఓ ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టింది. దాంతో ఆయన అపస్మారకంలోకి వెళ్లిపోయారు. దాంతో అతడిని విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య సరస్వతి, కుమార్తె ఉన్నారు.

## చీరకు నిప్పంటుకుని వృద్ధురాలి మృతి

బాడంగి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చీరకు నిప్పంటుని వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ తారకేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని పెద్దవీధికి చెందిన మరడాన పాపమ్మ (76) శనివారం సాయంత్రం ఇంటిలో కర్రల పొయ్యి దగ్గర వంట చేస్తుండగా చీరకొంగు అంటుకుని గాయాలపాలైంది. గాయాలపాలైన ఆమె కుమారుడు మరడాన అప్పలనాయుడు స్థానిక సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ ఆదివారం పాపమ్మ మృతిచెందినట్టు తెలిపారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారని తెలిపారు.

## గుర్తుతెలియని వాహనం ఢీ: వ్యక్తికి గాయాలు

రామభద్రపురం, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): తారాపురంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అదే గ్రామానికి చెందిన పిల్లా రమణ తీవ్ర గాయాల పాలయ్యారు. రమణ పశువులను తోలుకుంటూ ఇంటికి వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. గాయపడిన రమణను బంధువులు సాలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయనగరం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి



మురుగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్

రాజాం, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని గాయత్రి కాలనీలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపాల్ కమిషనర్ ఎ.రామచంద్రరావు హామీ ఇచ్చారు. ఆదివారం గాయత్రి కాలనీలో టీడీపీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ప్రధానంగా కాలువలు, సిమెంట్ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, స్పీడ్ బ్రేకర్స్, తాగునీటి సమస్య, శ్మశానవాటిక వంటి సమస్యలు ఉన్నట్టు గుర్తించారు. అంతే కాకుండా కాలనీలో ఇళ్లకు పన్నులు కూడా వేయడం లేదని, దాని వల్ల కుళాయిలు వేయించుకోవడానికి ఇబ్బందులు కలుగుతున్నాయని వార్డు టీడీపీ నాయకులు ముగ శ్రీను, వంగవీటి కోటి, సరళ.. కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. అనంతరం శ్రీనివాస కాలనీ, మెహర్ బాబా కాలనీ, మల్లికార్జున కాలనీల్లో కమిషనర్ పర్యటించారు. ప్రజా సమస్యలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు.

## మహాకవి గురజాడకు ఘన నివాళి

గుర్ల, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం మహాకవి గురజాడ వర్ధంతిని నిర్వహించారు. గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. విజ్ఞాన కేంద్రం జిల్లా కన్వీనర్ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పశు గణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ బెల్లాన బంగారునాయుడు హాజరయ్యారు. ముందుగా మహాకవి గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు సీహెచ్.రమేష్ మాట్లాడుతూ మూఢనమ్మకాలను కులమత భేదాలను నిరసిస్తూ గురజాడ చేసిన రచనలను వివరించారు. పాఠశాల నృత్య ఉపాధ్యాయని కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థినులు గురజాడ గేయాలకు నృత్య రూప ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో గోషాడ పాఠశాల హెచ్‌ఎం చందక అప్పలనాయుడు, ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## వక్తృత్వ పోటీల్లో లాస్యకు ప్రథమస్థానం



అవార్డు అందుకుంటున్న లాస్య

నెల్లిమర్ల, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత గురజాడ అప్పారావు వర్ధంతిని పురస్కరించుకుని గురజాడ సాంస్కృతిక సమాఖ్య జిల్లా స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో జరజాపుపేట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. వక్తృత్వ పోటీలో ఎం.లాస్య ప్రథమ బహుమతి, వ్యాసరచనలో డి.తనుశ్రీ ప్రత్యేక బహుమతిని సాధించిందని హెచ్‌ఎం సునర్ల కామేశ్వరి తెలిపారు. ఆనంద గజపతి ఆడిటోరియంలో నిర్వహించిన గురజాడ అప్పారావు వర్ధంతి కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్.మానవేంద్రనాథ్‌రాయ్, కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, ఎస్పీ దామోదర్‌రెడ్డి చేతుల మీదుగా లాస్య అవార్డు అందుకున్నారని తెలిపారు. బహుమతులు అందుకున్న విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులుఅభినందించారు.

## విద్యార్థులకు సుపథ పరీక్షలు

శృంగవరపుకోట, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం సుపథ పరీక్షలు నిర్వహించారు. 14 పాఠశాలల నుంచి 613 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పద్య పఠనం, శ్లోక పఠనం, దేశభక్తి గేయాలు, శ్రీకృష్ణ చరితామృతం వంటి వాటిపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సుపథ రూపకర్త యు.వి.ఎ.ఎన్.రాజు, విన్నకోట భాస్కరశర్మ, కె.సత్యనారాయణవిజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

## పేద విద్యార్థినికి రూ.10వేల సాయం

గుర్ల, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): పోలయవలస గ్రామానికి చెందిన బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని గొంప సుధకు అదే గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సేవాసంస్థ సభ్యులు ఆదివారం రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. విద్యార్థినికి పుస్తకాలు కూడా అందిస్తామని సభ్యులు తెలిపారు.



చెక్కును అందజేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

దత్తిరాజేరు, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని రాష్ట్ర మంత్రి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం విజయనగరంలోని తన కార్యాలయంలో మండలంలోని పప్పల లింగాలవలస గ్రామానికి చెందిన కడియాల ఉమకి రూ.77,801 సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, టీడీపీ నాయకులు ముకుందరావు తదితరులున్నారు.

### శ్రీనివాసమూర్తి ఆదర్శప్రాయుడు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి డీఆర్‌వో శ్రీనివాసమూర్తి ఆదర్శప్రాయుడని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కొనియాడారు. డీఆర్‌వో ఉద్యోగ విరమణ నేపథ్యంలో ఆదివారం స్థానిక ప్రైవేట్ హోటల్‌లో జిల్లా అధికారుల అసోసియేషన్ జిల్లా రెవెన్యూ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో మంత్రితో పాటు కలెక్టర్ రామసుందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఏ సమస్యనైనా పరిష్కంరిచగల నేర్పరితనం శ్రీనివాసమూర్తి సొంతమన్నారు. ఆయనకు అనుభవంతో బాటు గొప్ప నాయకత్వ లక్షణాలు ఉన్నాయని ప్రశంసించారు అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ శ్రీనివాసమూర్తి ఎంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించారని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ ఐఏఎస్ అధికారి కృష్ణయ్య , జేసీ సేతుమాధవన్, డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ధ్యేయం




రైతులతో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అదితి గజపతి రాజు అన్నారు. ఆదివారం సాయంత్రం ఆమె మండలంలోని కోరుకొండపాలెంలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం చేపడుతున్న పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. తాజాగా విడుదల చేసిన అన్నదాతా సుఖీభవ నిధులపై ఆరా తీశారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. రైతులు ప్రభుత్వ ప్రోత్సాహన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కర్రోతు వెంకట నర్సింగరావు, వైఎస్ చైర్మన్ చంద్రినాయుడు, టీడీపీ నాయకులు గంటా పోలినాయుడు, పాసి అప్పలనాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాయుడు పాల్గొన్నారు.

## సందడిగా వన సమారాధన



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సువర్ణరేఖ

శృంగవరపు కోట, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుణ్యగిరి రోడ్డులో ఆదివారం వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన సందడిగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమర యోధుడు గొర్రిపాటి బుచ్చి అప్పారావు చిత్రపటానికి ఆమెతో పాటు పీఏసీఎస్ చైర్మన్ జీఎస్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు డోకుల అచ్చెంనాయుడు, పోతల వెంకటరమణ తదితులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాటిపూడి జలాశయానికి జి.బి.అప్పారావు జలాశయంగా నామకరణం చేసే విషయం శాసనసభలో ప్రస్తావించడంపై ఎమ్మెల్యేను వెలమ సంక్షేమ సంఘం కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెట్రోలియం అండ్ ఎనర్జీ వర్సిటీ అసోసియేట్ ప్రొ.డాక్టర్ రంధి రామునాయుడు, స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ సువర్ణ రేఖ, జనరల్ ఫిజిషియన్ డా. కె.రామమూర్తి, నేత్ర వైద్యుడు జీవీకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం



ట్రోఫీ అందజేస్తున్న ఎంఈవో

నెల్లిమర్ల, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయని ఎంఈవో సూర్యనారాయణమూర్తి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటకు చెందిన గాంధీరామ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు మద్దిల సన్యాసిరావు ఆధ్వర్యంలో నెల్లిమర్ల ఫుట్‌బాల్ మైదానంలో ఆదివారం నెల్లిమర్ల, గుర్ల మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. నెల్లిమర్ల మండల ఉపాధ్యాయుల జట్టుకు పిన్నింటి వాసు, గుర్ల మండల జట్టుకు హరి మోహన్ కెప్టెన్లుగా వ్యవహరించారు.ఈ పోటీల్లో నెల్లిమర్ల జట్టు విజేతగా నిలిచింది. నెల్లిమర్ల జట్టు క్రీడాకారుడు ఎస్.కిరణ్ ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా, గుర్ల మండల జట్టు నుంచి హరిమోహన్ బెస్ట్‌బౌలర్‌గా ఎంపికయ్యారు. నెల్లిమర్ల క్రీడాకారుడు పిన్నింటి వాసు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నారు. క్రీడాకారులకు ట్రోఫీ, మెడల్స్‌ను ఎంఈవో ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఎం.శ్రీనివాసరావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీహెచ్.ఆనందమూర్తి పాల్గొన్నారు. మ్యాచ్ రిఫరీలుగా ఆరిపాక బాబు విశ్వేశ్వరరావు, హరి శ్రీను, స్కోరర్‌గా కడలి సత్యసాయి గణేష్ వ్యవహరించారు.

## జనసేనను బలోపేతం చేయండి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

నెల్లిమర్ల, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ పటిష్టతకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి పిలుపునిచ్చారు. నెల్లిమర్ల సమీపంలోనే అటవీశాఖ నగర వనం పార్కులో ఆదివారం నియోజకవర్గస్థాయి జనసేన పార్టీ వన సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి, లోకం ప్రసాద్ దంపతులతో పాటు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకు వెళ్లాలన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి అడుగులు వేయాలన్నారు. ఈ సందర్భంగా పార్టీలో కీలకంగా పనిచేస్తున్న పలువురు నాయకులను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు చనమల్ల వెంకటరమణ, అవనాపు విక్రమ్, కరుమజి గోవిందరావు, కోట్ల రఘు, రవ్వా నాని, అంబల్ల అప్పలనాయుడు, ఎడ్ల గోవిందరావు, ఎంఎం.నాయుడు, పతివాడ గోవిందరావు, తుమ్ము వెంకటరమణ, జనా ప్రసాద్, గంటా సతీష్, అప్పికొండ రవికుమార్, బంటుపల్లి వాసుదేవరావు, పాలు శ్రీను, బాల అప్పలరాజు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి డీఆర్‌వోగా మురళి

విజయనగరం కలెక్టరేట్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి డీఆర్‌వోగా కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ మురళిని నియమిస్తూ కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. డీఆర్‌వో శ్రీనివాసమూర్తి ఉద్యోగ విరమణ చేయడంతో ఆ బాధ్యతలను మురళికి కలెక్టర్ అప్పగించారు.

## ఘనంగా మందిరం వార్షికోత్సవం

గజపతినగరం, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ఎం.కొత్తవలసలో ఆదివారం సత్యసాయిబాబా మందిరం వార్షికోత్సవాన్ని కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజలు చేపట్టారు. చిన్నారుల కోలాటాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## బూడిపేటలో సేవా కార్యక్రమాలు

గజపతినగరం, నవబంరు30 (ఆంధ్రజ్యోతి): బూడిపేట, దావాలపేట గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవా కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ నైపుణ్యాలు పెంపొందించేందుకు ఇలాంటి శిబిరాలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా వరద తిరుపతిరావు, సర్పంచ్ బూడి జ్యోతి పాల్గొన్నరు.

## నేడు యువతతో మంత్రి సమావేశం

గజపతినగరం, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ విద్యను అభ్యసించిన యువతీ, యువకులతో సోమవారం రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమావేశం కానున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు గంట్యాడ శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గం పరిధి లోని గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ, జామి మండలాలకు చెందిన యువతతో స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశం కానున్నారన్నారు.

## వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపండి

విజయనగరం దాసన్నపేట, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాల ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగభూషణం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదివారం నగరంలోని దాసరి నాగభూషణం భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందరికీ కల్పించాలన్నారు. రాష్ట్రంలో యూనివర్సిటీలకు నిధులు తెస్తామని, జీవోలు 107, 108 లను రద్దు చేసి వైద్య విద్యను ప్రభుత్వపరం చేస్తామని చెప్పిన పాలకులు ఆ మాటను విస్మరించడం తగదన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సుమన్, గౌరీశంకర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## మహాసభలను విజయవంతం చేయండి

విజయనగరం దాసన్నపేట, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): విశాఖలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకూ తలపెట్టిన అఖిల భారత మహాసభలను అందరూ విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వి.రమణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ 1970 ఏర్పడిందని, నాటి నుంచి నేటి వరకూ కార్మికవర్గ ఐక్యత, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, దేశ సమైక్యతకు కట్టుబడి పనిచేస్తోందన్నారు. కోటి మంది కార్మికులకు ప్రాతినిధ్యం వహించే సీఐటీయూ అఖిల భారత మహాసభలకు దేశవ్యాప్తంగా 200 మంది ప్రతినిధులు ఆరు దేశాల నుంచి హాజరుకానున్నారన్నారు. ఈ సందర్భంగా మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. సమావేశంలో నగర ఉపాధ్యక్షుడు రెడ్డి శంకరరావు, ఎ.జగన్మోహన్ రావు, బి.రమణ, మహాలక్ష్మి, సునీత పాల్గొన్నారు.

## టీడీపీలో 250 కుటుంబాల చేరిక



పార్టీలో చేరిన వారితో మంత్రి సంధ్యారాణి

మెంటాడ, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్ల, బడేవలస, జి.టి.పేటలకు చెందిన 250 కుటుంబాలు వైసీపీని వీడాయి. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సమక్షంలో ఆదివారం వారు టీడీపీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆమె సాదరంగా ఆహ్వానించారు. ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు మండల ప్రాదేశిక స్థానం గుర్లలో సింగంపల్లి అప్పలనాయుడు ఆధ్వర్యంలో 200 కుటుంబాలు, అలాగే బడేవలస, జి.టి.పేట గ్రామాలకు చెందిన సుమారు 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు చలుమూరి వెంకట్రావు, జి.అన్నవరం, సింగంపల్లి అప్పలనాయుడు, రెడ్డి ఆదినారాయణ, శరకాన రామునాయుడు, గొర్లె సన్యాసిరావు, అప్పికొండ సన్యాసిరావు, అప్పన్న, రెడ్డి ఎర్నాయుడు, గెడ్డ కాశీ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయంగా ఎదుర్కోలేకే ఆరోపణలు

మెంటాడ, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): రాజకీయంగా ఎదుర్కొనలేని కొందరు నాయకులు తనతో పాటు నా బిడ్డపైనా ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర గిరిజన సంక్షేమ మంత్రి సంధ్యారాణి ఆవేదన వెలిబుచ్చారు. ఆదివారం గుర్ల గ్రామంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అనుకూల మీడియా కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి రాతలు, కూతలు మాత్రం తీవ్రంగా పరిగణిస్తానని సాక్షి పత్రిక, చానల్‌పై మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలు కుతంత్రాలకు పాల్పడినా ప్రజాభిమానమే తనకు రక్షా కవచమన్నారు. తన బిడ్డ తప్పు చేసినట్టు నిరూపిస్తే ఒప్పుకుంటానని, కాదని తేలితే తప్పుడు ఫిర్యాదు చేయించిన వారి సంగతి తేలుస్తానన్నారు. రాజకీయంగా ఎదుగుదల చూసి ఓర్వలేక తమ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని కుట్రలు పన్నుతున్నారని ఆమె అన్నారు. తన పీఏ, కుమారుడిపై వచ్చిన ఆరోపణలను నిగ్గుతేల్చాలని పోలీసులను కోరానని చెప్పారు.

## బీజేపీకి ప్రాధాన్యమేదీ?

శృంగవరపుకోట, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): మిత్రపక్షమైన బీజేపీను స్థానిక టీడీపీ క్యాడర్‌తో పాటు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొక్కాకుల అప్పారావు, సీనియర్ నేతలు సీహెచ్‌ఆర్‌కే ప్రసాద్, కొట్యాడ రామకోటి, జామి మండల అధ్యక్షురాలు రాయవరపు ఆదిలక్ష్మి ఆవేదన వెలిబుచ్చారు. ఆదివారం స్థానిక కల్యాణ మండపంలో బీజేపీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని మండల పార్టీ అధ్యక్షుడు మరిశ శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై 18 నెలలు గడుస్తున్నా ఎటువంటి నామినేటెడ్ పదవులు, గ్రామాల్లో పనులు కేటాయింపులు లేవన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి వివరించి తదుపరి కార్యచరణకు దిగుతామన్నారు. సమావేశంలో నాయకులు కోన మోహనరావు, లట్టాల పవన్‌కుమార్, శివకుమార్, బొండపల్లి చంద్రశేఖర్, సత్యనారాయణ, మహేష్, దేముడు ఉన్నారు.

## టైలరింగ్ శిక్షణను వినియోగించుకోండి

గరివిడి, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): మహిళలు టైలరింగ్ శిక్షణను వినయోగించుకోవాలని బీసీ సెల్ ఆర్గనైజింగ్ రాష్ట్ర సెక్రటరీ వెన్నె సన్యాసినాయుడు అన్నారు. ఆదివారం గరివిడిలోని పాత వెంకటేశ్వర సిల్క్ ప్యాలెస్‌లో నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చనమల మహేశ్వరరావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుమలరాజు కిరణ్ కుమార్, సంచాన సన్యాసినాయుడు, సర్పంచ్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

## భగవద్గీత పఠనంతో జీవనసాఫల్యం

ఎస్.కోట రూరల్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత పఘనంతో జీవనసాఫల్యం సాధించవచ్చని విశ్వహిందూ పరిషత్ ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శి నాగభూషణం, జిల్లాశాఖ సభ్యుడు తిమిడి శ్రీరామ్, సీమ్ వ్యవస్థాపకుడు బొబ్బిలి రామకృష్ణ అన్నారు. ఆదివారం భర్తపురంలోని కల్యాణ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో భగవద్గీత సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ మండల కార్యదర్శి మామిడి సత్యనారాయణ, కె.జయవిష్ణు, ఎం.శ్రీనివాస రావు, శీనయ్య ఉన్నారు. అనంతరం భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు.

## అధికారులు మోసం చేశారు..

ఎస్.కోట రూరల్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన అర్జీలను అధికారులు పరిశీలించకుండా మోసం చేశారని జిందాల్ నిర్వాసితులు వాపోయారు. బొడ్డవరలో నిర్వహిస్తున్న 170వ రోజు ఆదివారం నిరసన దీక్ష శిబిరంలో వారు మాట్లాడారు. కలెక్టరేట్, మండల స్థాయిలో పీజీఆర్ఎస్‌లో పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించని పీజీఆర్ఎస్‌లు నిర్వహించడం తగదన్నారు. అర్జీలు సేకరించే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే కష్టాలు తెలుస్తాయన్నారు.

## టీడీపీ ఆత్మీయ సమావేశం రేపు

విజయనగరం రూరల్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నగర శాఖ ఆధ్వర్యంలో డిసెంబరు 2న జమ్ము నారాయణపురం రోడ్డులోని మారమ్మతల్లి ఆలయం ఎదుట తోటలో టీడీపీ నగర ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఆ పార్టీ అధ్యక్షుడు గంటా రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే అతిది గజపతిరాజుతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారన్నారు.

## పార్టీ కోసం పనిచేయండి

గుర్ల, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ప్రతీ కార్యకర్త పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని టీడీపీ అబ్జర్వర్ గేదెల రాజారావు కోరారు. ఆదివారం తెట్టంగి, పల్లిగండ్రేడుల్లోని బూత్ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో టీడీపీ బీసీ సెల్ ఆర్గనైజింగ్ రాష్ట్ర సెక్రటరీ వెన్నె సన్యాసినాయుడు, లక్ష్మునాయుడు, సూరినాయుడు పాల్గొన్నారు.

## గురజాడ జీవితం భావితరాలకు ఆదర్శం

(ఐదో పేజీ తరువాయి)

సందర్భంగా సాహితీస్రవంతి, జన విజ్ఞాన వేదిక సంయుక్త నిర్వహణలో ఆదివారం నగరంలోని గురజాడ గృహం నుంచి జిల్లా పరిషత్ వరకూ గౌరవ యాత్రను నిర్వహించారు. ఈ యాత్రలో పలువురు సాహితీ వేత్తలు, రచయితలు, కవులు, నగర ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన గురజాడ రచనలు- ప్రాసంగికతపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాహితీస్రవంతి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తెలకలపల్లి రవి, రచయితలు అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరీనాయుడు, సాహితీస్రవంతి ప్రతినిధులు చీకటి దివాకర్, జన విజ్ఞాన వేదిక ప్రతినిధి ఎంవీఎస్ వెంకటరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ప్రసంగిస్తూ.. గురజాడ సమాజంలో వెలుగులను నింపే ఓ శక్తిగా నిలిచారన్నారు. గురజాడ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. గురజాడ దేశభక్తి గేయాన్ని విద్యాలయాల్లో ప్రార్థనా గీతంగా ప్రకటించాలన్నారు. ఆయన పేరుతో విజయనగరంలో సాంస్కృతిక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగలి పోతన్న, మయూరి హోటల్ అధినేత బాబురావు, పెద్దింటి అప్పారావు, వీఎస్ ప్రసాద్, సాహితీవేత్తలు, రచయితలు, సాహితీస్రవంతి, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## అదనపు భారం

(ఐదో పేజీ తరువాయి)

ఎంఎల్‌డీల సామర్థ్యంతో పథకాల నిర్మాణానికి నిధులు కూడా మంజూరయ్యాయి. సాలూరు మునిసిపాలిటీకి సంబంధించి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యింది. కానీ, పనులు చేపట్టడంలో వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం చేసింది. ఇప్పుడు అవే పనులకు రూ.218.19 కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయించింది. అంటే అదనంగా రూ.47 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోంది.

● బొబ్బిలి, పార్వతీపురం మునిసిపాలిటీల్లో 32 ఎంఎల్‌డీల సామర్థ్యంతో నీటిని అందించేందుకు పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి(యూఐడీఎఫ్) నుంచి రూ.180 కోట్లు కేటాయించారు. గతంలో టెండర్లు పూర్తయ్యాయి. కానీ, కాంట్రాక్టర్లు సకాలంలో పనులు చేయకపోవడంతో బిల్లులు నిలిచిపోయాయి. ఇప్పుడు అవే పనులకు రూ.212.93 కోట్లు కేటాయించాల్సి వచ్చింది. అంటే పెరిగిన అదనపు వ్యయం రూ.32 కోట్లు.

● విజయనగరం నగరపాలక సంస్థతో పాటు రాజాం మునిసిపాలిటీలో తాగునీరు అందించేందుకు గాను అమృత్ పథకం మంజూరు చేశారు. ఆ తరువాత ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ పరిధిలోకి మార్చారు. గతంలో ఈ రెండింటికీ రూ.60 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. కానీ ఇప్పుడు రూ.76.18 కోట్లకు అంచనా వ్యయం చేరుకుంది. అంటే రూ.16 కోట్ల భారం పెరిగింది.

## 24 గంటల్లోనే ధాన్యం నగదు జమ

గరుగుబిల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే.. నగదు జమ కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని మండల పరిషత్ అధ్యక్షులు ఉరిటి రామారావు తెలిపారు. ఆదివారం మరుపెంటలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం విక్రయించిన ఒకట్రెండు రోజుల్లో బ్యాంకు అకౌంట్లలో నగదు జమవుతుందన్నారు. దీంతో రైతుల కుటుంబాల్లో పండగ వాతావరణం నెలకొందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ధాన్యం తరలించడం జరుగుతుందని తెలిపారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారన్నారు.

## గిరిజనులకు సేవ చేయాలి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎస్టీ కమిషన్ మెంబర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కడ్రక మల్లేశ్వరరావు గిరిజనులకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని గిరిజన సంఘాల నాయకులు కోరారు. ఆదివారం ఆయన్ని మండల కేంద్రంలో సన్మానించారు. ఇటీవలే విజయవాడలో ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మల్లేశ్వరరావు మొదటిసారిగా గుమ్మలక్ష్మీపురం వచ్చిన సందర్భంగా పలువురు ఆయన్ని కలిశారు. తహసీల్దార్ నిమ్మక శేఖరం, ట్రైబల్ రైట్స్‌ఫోరం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు రొబ్బా లోవరాజు, ఇంటికుప్పల రామ కృష్ణారావు, నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షుడు మండంగి భూషణరావు పాల్గొన్నారు.

## మోడల్ పరీక్షకు 224 మంది హాజరు

వీరఘట్టం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలోని ఓ కాలేజ్‌లో ఆదివారం నిర్వహించిన జవహర్ నవోదయ మెగా మెడికల్ పరీక్షకు 224 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొదటి 20 స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.

### నేడు ఐటీడీఏలో పీజీఆర్ఎస్

సీతంపేట రూరల్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వ హించనున్నట్లు ఐటీడీఏ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలపై అర్జీలు అందించేందుకు గిరిజనులు గ్రీవెన్స్‌కు రావాలని కోరారు.

# చురుగ్గా పారాది కాజ్‌వే పనులు

బొబ్బిలి రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారాది వద్ద వేగావతి నదిపై చేపడుతున్న కాజ్‌వే మరమ్మతుల పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మరో వారం రోజుల్లో పనులు పూర్తయి కాజ్‌వే అందుబాటులోకి రానుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాజ్‌వే పూర్తిగా దెబ్బతింది. దీంతో వాహనాలు, ప్రజల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. కాజ్‌వే మరమ్మతుల కోసం కలెక్టర్ వరద సహాయ నిధుల నుంచి రూ.15 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు కాంట్రాక్టరు పనులను వేగవంతం చేస్తున్నారు. ప్రస్తుతం కాజ్‌వే లేకపోవడంతో అటుగా వెళ్లే భారీ వాహనాలను బొబ్బిలి నుంచి అలజంగి-తెర్లాం రహదారి వైపు మళ్లిస్తున్నారు. దీంతో గొల్లపల్లి, అలజంగి, కారాడ తదితర గ్రామీణ రహదారులపై భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ఆ రోడ్లు ఛిద్రమవుతున్నాయి. దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పారాది కాజ్‌వే నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందా? ఈ ఇబ్బందులు ఎప్పుడు తప్పుతాయా అని అంటున్నారు. ఈ విషయమై ఆర్‌బీ ఏఈ రాజును వివరణ కోరగా.. కాజ్‌వే మరమత్తులు పూర్తి చేసి అందుబాటులోకి వచ్చేందుకు మరో వారం రోజులు సమయం పడుతుందని తెలిపారు.



వేగావతి నదిపై కాజ్‌వే పనుల దృశ్యం

## పది కుళాయిలకు ఒక్కటే పని చేస్తోంది..

● ఇదీ పెంట గ్రామంలోని తాగునీటి ట్యాంకు పరిస్థితి

● గ్రామస్థులకు తప్పని ఇబ్బందులు

బొబ్బిలి రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట గ్రామంలో కుళాయిల వద్ద తాగునీటిని పట్టుకునేందుకు గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామంలో సుమారు 5వేల లీటర్ల సామర్థ్యంతో తాగునీటి ట్యాంకు ఉంది. ఈ ట్యాంకుకు పది కుళాయిలు ఉండగా.. ఒక్కటి మాత్రమే పని చేస్తోంది. మిగతావన్నీ విరిగాపోయాయి. దీంతో గ్రామస్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతిరోజూ తెల్లవారేసరికి తాగునీటిని పట్టుకునేందుకు ఆ కుళాయి వద్ద చాంతాడంత క్యూ లైన్‌లో నిలబడవలసి వస్తుందని, దీనివలన ఉపాధి పనులు, కూలి పనులకు వెళ్లేందుకు ఆలస్యం అవుతుందని మహిళలు వాపోతున్నారు. గత రెండేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొందని, గ్రామ పెద్దలు, అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి వాటర్ ట్యాంకుకు కొత్త కుళాయిలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే ట్యాంకు చుట్టూ ఉన్న మురుగును తొలగించాలని విన్నవిస్తున్నారు. దీనిపై ఏఈ విశ్వతేజని వివరణ కోరగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



వ్యాటర్ ట్యాంకు చుట్టూ విరిగిన కుళాయిలు, ఒక్క కుళాయి వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

# సమాజంలో వెలుగులను నింపిన మహోన్నత వ్యక్తి గురజాడ



బొబ్బిలి: గ్రంథాలయంలో గురజాడకు నివాళులర్పిస్తున్న దృశ్యం



బొబ్బిలిరూరల్: గున్నతోటవలసలో నివాళులర్పిస్తున్న గ్రీన్ బెల్ట్ సొసైటీ సభ్యులు

బొబ్బిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తన రచనలు, గేయాలతో సమాజంలో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి గురజాడ అప్పారావు అని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు అన్నారు. స్థానిక ప్రభుత్వ గ్రంథాలయంలో ఆదివారం ప్రముఖ సంఘసంస్కర్త, రచయిత గురజాడ అప్పారావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. లైబ్రేరియన్ స్వర్ణకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కారుణ్యఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనాటి సమాజంలో నెలకొన్న సామాజిక దురాచారాలపై గురజాడ ఉద్యమ యుద్ధం చేశారన్నారు. సమాజాన్ని తన అమూల్యమైన రచనలతో చైతన్యంతో ముందుకు నడిపించిన గొప్ప కవి, రచయిత అప్పారావు అని కొనియాడారు. ఇటీవల గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించిన లైబ్రేరియన్ స్వర్ణకుమారిని సత్కరించారు. కార్యక్రమంలో రమేష్, రామకృష్ణ, చిన్నారావు, జీసీహెచ్‌జీ శర్మ, ఆర్ఎన్ రాజు, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### మొక్కలు నాటిన గ్రీన్ బెల్ట్ సొసైటీ

బొబ్బిలి రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్‌వీ రమణమూర్తి అన్నారు. గున్నతోటవలస గ్రామ శివారున అపార్ట్‌మెంట్ వద్ద గురజాడ అప్పారావు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా బొబ్బిలి గ్రీన్ బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో సభ్యులు మొక్కలు నాటారు. ముందుగా గురజాడ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సొసైటీ అధ్యక్షుడు ఎస్‌వీ రమణమూర్తి మాట్లాడుతూ.. గురజాడ ఆధునిక తెలుగు సాహిత్యానికి, వాడుక భాషకు పునాది వేసిన గొప్ప కవి, రచయిత అని కొనియాడారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సభ్యులు మహేష్, కృష్ణదాస్, వీఎన్ శర్మ, రాజు, తదితురులు పాల్గొన్నారు.

# అవగాహనతోనే నియంత్రణ

(ఐదో పేజీ తరువాయి)

వచ్చాయి. హెచ్‌ఐవీ, ఎయి డ్స్ తీవ్రతను తగ్గించే చాలా రకాల మందులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సైతం అందుబాటులో ఉన్నాయి. 2008 నుంచి ఏఆర్‌టీ (యాంటీ రెట్రోవైరల్ థెరపీ ద్వారా)మందులు ఇస్తున్నారు. బాధితులకు నెలకు రూ.4వేలు చొప్పున పింఛన్ కూడా అందుతోంది. ఉమ్మడి జిల్లాలో రెండు ఏఆర్టీలు ఎనిమిది లింకు కేంద్రాలు, 13 ఐసీటీసీ ల్యాబ్‌లు, 3 సుఖ వ్యాధి చికిత్స కేంద్రాలు పనిచేస్తున్నాయి. రెండు జిల్లాల్లో ప్రైవేటు, ప్రభుత్వ పరీక్ష కేంద్రాలు 100 వరకూ ఉన్నాయి. గతంలో మాదిరిగా ఎయిడ్స్‌పై చైతన్య కార్యక్రమాలు తగ్గుతుండడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. గతంలో వైద్య ఆరోగ్య శాఖతో పాటు స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టేవి. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులూ ముందుకు వచ్చేవారు. కళాశాలలు, గిరిజన ప్రాంతాలు, మురికివాడలు, పల్లెలకు వెళ్లి చైతన్యపరిచేవారు. వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించడంతో ఆసక్తి ఉండేది. కానీ క్రమేపీ ప్రభుత్వాల ప్రోత్సాహాలు లేకపోవడంతో ఇటువంటి కార్యక్రమాలు తగ్గుముఖం పట్టాయి.

### వినియోగించుకోవాలి..

హెచ్‌ఐవీ వైరస్ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. సకాలంలో మందులు అందిస్తే చాలా ప్రయోజనం. చాలా మంది నిర్లక్ష్యం చేస్తుంటారు. పరీక్షలు చేయించుకోవడానికి ముందుకు రారు. అందుకే మొబైల్ వాహనాన్ని అందుబాటులోకి తెచ్చాం. ఆ వాహనం సేవలను వినియోగించుకోవాలి.

**-డాక్టర్ కె.రాణి, పర్యవేక్షణాధికారి, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, విజయనగరం**

### ఇంటి వద్దే పరీక్షలు..

హెచ్‌ఐవీ పరీక్ష కేంద్రాలు జిల్లా వ్యాప్తంగా 100కు పైగా ఉన్నాయి. కానీ కొందరు రకరకాల అనుమానాలతో అక్కడకు రావడం లేదు. దీంతో వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. మొబైల్ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జిల్లాలో మొబైల్ వాహనాన్ని ప్రారంభించింది. ఇది నేరుగా గ్రామాల్లో తిరుగుతుంది. వీధుల్లో సైతం సంచరిస్తుంది. అవసరం అనుకుంటే వ్యాధిగ్రస్థుడి ఇంటి ముందే ఆగుతుంది. అక్కడే రక్తనమూనాలు సేకరించి గంటలోపే ఫలితం వెల్లడిస్తుంది. అందులో ల్యాబ్ టెక్నీషియన్‌తో పాటు కౌన్సిలర్ కూడా ఉంటారు. అన్ని అంశాలపై కౌన్సిలర్ అవగాహన కల్పిస్తారు.

### ముందే మేల్కొవాలి..

ముందే గుర్తించి మేల్కొంటే ప్రాణాపాయం తప్పించుకోవచ్చు. హెచ్‌ఐవీని నియంత్రించే చాలారకాల మందులు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం మద్యం మత్తులో యువత చిత్తు అవుతోంది. ఈ క్రమంలో తప్పటడుగులు పడుతున్నాయి. గిరిజన తాండాల్లో అవగాహన లేకపోవడం, బాధితులపై పర్యవేక్షణ కరువవ్వడం, కేసుల గుర్తింపులో జాప్యం తదితర కారణాలతో ఎక్కువ మంది ఆస్పత్రిపాలవుతున్నారు. ఎయిడ్స్ ప్రాణాంతకమైనప్పటికీ మందులు వాడితే కొంత కాలం ప్రాణాలు నిలపవచ్చు. కానీ అవగాహన లేకపోవడమే ప్రధాన సమస్య. హెచ్‌ఐవీ బయటపడితే కుటుంబ పరువు ఎక్కడిపోతుందోనని చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరికొందరు కుటుంబాలకు దూరంగా ఉంటున్నారు. మరికొందరు మనో వ్యధకు గురై మరింత కృంగిపోయి మరణిస్తున్నారు. అయితే హెచ్‌ఐవీ సోకిన వెంటనే మరణం రాదు. ఏఆర్టీ కేంద్రాలకు వెళ్లి మందులు వాడితే కొంతకాలం హాయిగా జీవించవచ్చు. దీనిపై ప్రచారం పెరగాల్సిన అవసరం ఉంది.

### అవగాహన కల్పిస్తున్నాం..




ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. అన్నిశాఖల సమన్వయంతో అన్ని సబ్‌జైళ్లలో ఖైదీలకు హెచ్‌ఐవీ, సుఖవ్యాధులపై అవగాహన, కౌన్సిలింగ్, రక్తపరీక్షలు నిర్వహిస్తున్నాం. ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులకు రూ.4 వేల పెన్షన్ అందజేస్తున్నాం. ఇప్పటివరకూ 1,977 మంది లబ్ధి పొందుతున్నారు. అవగాహనతోనే ఎయిడ్స్‌ను నియంత్రించవచ్చును. హెచ్‌ఐవీకి చికిత్స లేదు. కానీ నివారణ మాత్రం మన చేతుల్లో ఉంది. బాధితులపై వివక్ష చూపకూడదు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో హెచ్‌ఐవీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. అవగాహన కార్యక్రమాలు సైతం రూపొందిస్తున్నాం.

**-డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, విజయనగరం**

## ప్రారంభానికి సిద్ధమైన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్

పాలకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ పరిధిలో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఎట్టకేలకు ప్రారంభానికి సిద్ధమైంది. గత వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు మందకొడిగా సాగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పనులను వేగవంతం చేసింది. సుమారు రూ.80 లక్షలతో నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన సమీక్షలో ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈ భవనంపై ఆరా తీశారు. నిర్మాణం పూర్తయిందని, డ్రైన్ ఏర్పాటుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికారులు చెప్పారు. అయితే దీనికి త్వరితగతిన పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో భవనాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. అన్ని హంగులతో నూతన భవనం అందుబాటులోకి వస్తే.. అటు, వైద్య సిబ్బంది, ఇటు రోగులకు ఇక్కట్లు తప్పుతాయి.



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఆయుష్మాన్ మందిర్

## నేడు గీతా జయంతి వేడుకలు

● హాజరుకానున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా

బెలగాం, నవంబరు30(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం రైతు బజార్ సమీపంలో సోమవారం గీతా జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిం చనున్నట్లు గోపాలకృష్ణ యాదవ సంఘం నిర్వాహకులు మంచిపల్లి శ్రీరాములు తెలియజేశారు. ఆదివారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యే విజయ చంద్ర హాజరవుతారని చెప్పారు. భారీ అన్నదానం కార్యక్రమం నిర్వహించ నున్నట్లు తెలిపారు. రాధాకృష్ణ విగ్రహాల ఊరేగింపు కూడా ఉంటుందన్నారు.

### నిబంధనల మేరకే ధాన్యం సేకరించాలి

పాలకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సీజన్ ధాన్యం విక్రయాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనల మేరకే ధాన్యం సేకరణ చేపట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడారు. మిల్లర్లు దోపిడీని అధికారులు నియంత్రించాలన్నారు.జిల్లాలో ఉన్న మిల్లర్లంతా రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. క్వింటాకు ఐదు కేజీల అదనంగా దింపుడు కూలి కావాలని పేచిపెడుతున్నారని తెలిపారు. రైతులను ఇబ్బందులు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని డిమాండ్ చేశారు.

## గిరిజన పంచాయతీలను ఏర్పాటు చేయాలి



డొంగురువలసలో గిరిజనులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శంకరరావు

బొబ్బిలి రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న గిరిజన గ్రామాలన్నీ కలిపి గిరిజన పంచాయతీలుగా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మోసూరువలస, ఎరకొండరవలస, డొంగురువలస, చిలకమ్మవలస, సియోనువలస తదితర గిరిజన గ్రామాల్లో ఆదివారం పర్యటించి గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గిరిజనులకు ప్రత్యేకమైన పంచాయతీలు లేనందున వారి అవసరాలకు అనుగుణంగా తీర్మానాలు జరగడం లేదన్నారు. ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు సక్రమంగా అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలోని దాదాపు 16 గిరిజన గ్రామాలు ఉన్నాయని, కొన్ని సీహెచ్ బొడ్డవలస, కాశిందొరవలస పంచాయతీల్లో ఉన్నాయని, మరికొన్ని జీఎస్ఆర్ పురంలో ఉన్నాయని తెలిపారు. ఈ గ్రామాలను ఆ పంచాయతీల నుంచి విడదీసి జనాభా ప్రాతిపదికన రెండు గిరిజన పంచాయతీలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం, సభ్యులు కె.కొలన్నదొర, పి.పోలన్నదొర, గిరిజనులు పాల్గొన్నారు.

## కామేశ్వరరావుకు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న దృశ్యం

బొబ్బిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఆదివారం విద్యుత్ సంఘం నేత ఎస్ఏఎస్ కామేశ్వరరావు సంస్మరణ సభ నిర్వహించారు. కామేశ్వరరావు చిత్రపటానికి పూల మాలవేసి డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎం.శ్రీనివాసరావు నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు అన్న, వస్త్రదానం చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం మాజీ నేత బలగ సాయికృష్ణ మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కామేశ్వరరావు అలుపెరగని పోరాటం చేశారన్నారు. సమస్యల తీవ్రతను యాజమాన్యం తెలుసుకోవాలన్న సంకల్పంతో 1973 లో ఆత్మహుతికి పాల్పడ్డారన్నారు. విద్యుత్ ఉద్యోగులకు అందుతున్న ఫలాలు ఆయన పోరాట ఫలితంగా దక్కినవేనని అన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ బి.సాంబశివరావు, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామినాయుడు, అల్లు శంకరరావు, పెద్దలు రేజేటి కూర్మయ్య, ఎం.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## పిరిడిలో అన్నదానం



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పిరిడి గ్రామంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధిగా బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి చినఅప్పలనాయుడు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాల్లో ముందుండి నడిపించిన మహోన్నత వ్యక్తి సత్యసాయి బాబా అన్నారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ ఎస్.మురళీకృష్ణ, గ్రామ సర్పంచ్ తుట్ట వరలక్ష్మి, బొత్స కాశినాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మినీ వాటర్ ట్యాంక్ ప్రారంభం



మినీ వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

తెర్లాం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జగన్నాథవలస గ్రామంలో ఏర్పాటు చేసిన మినీ వాటర్ ట్యాంక్‌ను ఆదివారం ఎమ్మెల్యే బేబినాయన ప్రారంభించా రు. గత కొన్నేళ్లుగా గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంక్ నీరు గ్రామ ప్రజలకు సరిపోవడం లేదు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే తన సొంత నిధులతో గ్రామంలో 5వేల లీటర్ల మినీ వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు పెరుమాళిలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు, నాయకులు వెంకటేశ్వరరావు, జగ్గారావు, అభిలాష్, విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.